


# ప్రార్థన

## పేరేవేరు - వారే వీరు

### ప్రార్థనా పద్యములు

**రచన :**
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech



## తొలిపలుకు

చిన్నప్పుడు మనం చెప్పేది నిజం అని నమ్మకం కలుగుటకు 'దేవుడి తోడు' అనేవాళ్ళం. దానికి నాకు అర్థం 50 ఏళ్ళ తర్వాత ఒక తెల్లవారుజామున తెలిసింది. ఇది చదివే వాళ్ళలో నాలాంటి తెలివి తక్కువ వాడికోసం నాకు తట్టిన ఆలోచన ప్రస్తావిస్తాను.

దేవుడితోడు అంటే నేచెప్పేదానికి సాక్షి ఆ దేవుడే. వాడు ఎప్పుడూ తోడుగా వుండి అన్నీ సాక్షీభూతుడిగా చూస్తూ ఉంటాడు కాబట్టి నేను నిజం చెప్తాను అబద్ధం చెప్పను అని.

నేటికీ మనం కోర్టుల్లో చేసే ప్రమాణం అదేకదా. ఆ దేవుడెవరు? ఎలా వుంటాడు? ఏం చేస్తాడు? ఎన్నటి వాడు? ఎక్కడ వుంటాడు? ఎవ్వరికీ తెలియదు. గాలి చల్లగా వుంది అంటాం.



గాలినీ చూడలేరు, చలిని చూడలేరు, కానీ అనుభవించి దానికోపేరు పెట్టుకుని ఆపేరు పలికినప్పుడల్లా ఆ అనుభవం మెదడులో తిరిగి "రీప్లే" చేసుకుని 'నిర్ధారణ' చేసుకుంటాం.

అదే విధంగా దేవుడు కూడా అనుభవమే. అయితే అది అలౌకిక అనుభవం. అది తెలుసుకొన వలెనంటే అనుభవించాలి. దానికి నమ్మకం దృఢంగా కలగాలి. దానికి భక్తి వుండాలి. భక్తికి ధ్యానం కావాలి. ధ్యానం చేయాలంటే ప్రార్థన చేయాలి. ప్రార్థన లేకుండా మౌనంగా చేసే ధ్యానమే తపస్సు.

అట్లా ధ్యానం చేయలేని నాబోటి చిన్న వాళ్ళు చేసే దైవారాధనే ప్రార్థన. ఈ పుస్తకంలో మనం కొలిచే, కొలుస్తున్న దేవతల్ని ప్రస్తుతించాను. అన్నీ కందపద్యాలు సాధ్యమైనంత తేలిక భాష వాడాను. కొన్నిచోట్ల మంచి మంచి అలంకారాలు కూడా కుదిరి నాకు తృప్తి కలిగింది.



తాత్పర్యం చాలా పద్యాలకి అవసరంలేకపోయినా అన్ని పద్యాలకీ తాత్పర్యం వ్రాశాను.

ఇది వ్రాయటానికి ఇంకో కారణం ఉంది. నేటి యువత యొక్క వేలం వెర్రిని, మన విద్యా విధానాన్ని దుయ్యబడుతూ 'సమతీ శతకం' ఒకటి వ్రాశాను. భక్తి ప్రస్తావనలేని ఆ ప్రయత్నం వాసనలేని కాగితం పువ్వు అనిపించి నాలుగేళ్ళనుంచి మూలపారేశాను.

ఈరోజు దాన్ని చూసి ప్రాయశ్చిత్తంగా "పేరేవేరు వారేవీరు" అనే ఈ పుస్తకంలో రకరకాల దేవతల్ని చక్కటి కంద పద్యాలలో ప్రస్తుతించాను.

అల్లాను, జీసస్‌ను కూడా ప్రార్థించాను. ఇది అందరికీ ఆనందం, పుణ్యం ఇస్తుందని నా ఆశ.

❋❋❋

## అంకితం

సీ॥ పుట్టినవారికి గిట్టుట తప్పదు
గిట్టువారు మరల పుట్టుటగును
గిట్టినాడని అంతకీర్తించి ఏడ్తురు
పుట్టినానని జీవి పొరలిఏడ్చు
కానిరారు తమవెంట కొనిపోరు పుడకైన
'ఆశ' వీడదు 'అంత' మయెడిదాక
దీని నెరింగిన ధీశాలివగవడు
దేవుడే దిక్కని తెలుసుకొనును

ఆ॥ వానినున్న పరమబ్రహ్మను దెలియగ
తానెబ్రహ్మయగును తననెరుంగు
అంతరాత్ముడైన ఆపరబ్రహ్మకే
అంకితమ్ము నిత్తు అమితభక్తి



## శ్రీ గణపతి

కం॥ గణనాధుడవై అపుము
గణములు విఘ్నములు సలిపి కలవరపరచన్
గణనకురానే రానయ
గణగణవాయించిఘంట గణపతి!కొలుతున్

తా॥ ఓగణపతిదేవా! నేను గణగణమని ఘంట వాయించి నిన్ను పూజిస్తాను. నేను లెక్కపెట్ట వలసిన వాడిని కాను. కానీ విఘ్నములు కలిగించి బాధపెట్టే గణములనన్నిటినీ గణనాధుడవై ఆపిమమ్ము సంరక్షించు.



## శ్రీహరి

కం॥ మనుమన మనమున మనయని
మనమున మన, మనమునీకు మనదే మనెదన్
మన మన మానక నేనన
మన మన యని అనవు మనసిజు జనకా!

తా॥ మన్మధునికే తండ్రివయిన ఓ శ్రీహరీ! స్థిరంగా నా మనస్సులో ఉండవయ్యా అంటే ఉండటానికి నామనస్సులో నీకు మనస్సు కలుగుట లేదు. నేను మనవాడు మనవాడు అని అనుకుంటుంటే నీవు మనవాడు మనవాడు అని నన్ననుకోవు నామొర వినవు.



## శ్రీలక్ష్మి

కం॥ శ్రీలలనామణి తల్లీ!
ఏలుము లోకాలనెల్ల హితములు కలుగన్
ఆలివి హరికిని నళినీ
బాలవు నేకొల్తునమ్మ పాలింపవెనన్

తా॥ ఓ తల్లీ శ్రీదేవీ! అన్ని లోకాలను మేలు కలిగిస్తూ పరిపాలించుము. నీవు శ్రీమహావిష్ణువునకే అర్ధాంగివి, పద్మమే నెలవైన బాలవు. నిన్ను నేను సదా పూజిస్తాను. నన్ను దయతో పాలింపుము.

## శంకరుడు

కం॥ లయకారకుడా శంభుడు
లయబద్ధము వాని నాట్యరాజము తానా
లయమౌ జ్ఞానపు, నేమే
లయె, ఇది ఇటు తెలిసికొంటి నయ్యా! రారా

తా॥ పరమశివుడే లయకారకుడు. వాని నాట్యము లయ బద్ధమైనది. ఆయన జ్ఞానపు నిలయమైనవాడు. నాకు మేలుకలిగి ఈ సంగతి ఈ విధంగా నేను తెలిసికొంటిని. ఓతండ్రీ ఈశ్వరా! రారా.



## పార్వతీ దేవి

కం॥ ఎంతటి వారలు అయినన్
కాంతకు దాసులు అనంగ కడు సత్యంబౌ
అంతటి హరుడే సగమిడె
సంతోషము తల్లి గిరిజ! సాటియు గలరే?

తా॥ అంతటి ఆ శంకరుడే తన సగము శరీరమే ఆనందం నిండగా నీకిచ్చాడు.ఎంతటి వారైనా భార్యకు దాసులనుట నిజము. ఓతల్లీ! పార్వతీ నీకు ఎవరమ్మా సాటి.



## గంగావతరణ

కం॥ గంగమ్మ దూకి వచ్చెను
నింగిని వీడుచును దాను, నిలిపెను వేణిన్
మంగళకరుడా హరుడే
గంగమ్మను సతిగబొంది కడలికి బంపెన్

తా॥ ఆ గంగమ్మ ఆకాశం వదలి దూకుడుగా వచ్చింది (భగీరథుడి తపోదీక్షవలన) ఆమెను మంగళకరుడైన శివుడు తన జటాజూటంలో బంధించి జాలిదలచి సతిగా స్వీకరించి అప్పుడు సముద్రానికి పంపించాడు.



## శ్రీరామచంద్రుడు

కం॥ శ్రీరామ రామ రామని
నోరారగ పిలువనేల నొప్పా? నరుడా!
కారే కుండర బ్రతుకే
నీరము పోలోపె వేడు నిరుపమ భక్తిన్

తా॥ ఓనరుడా! నీనోరు పండేట్లుగా ఆ శ్రీరామ చంద్రుని శ్రీరామ, రామ రామ అని పిలు. నోరు నొప్పా? నీ బ్రతుకు కారిపోయే కుండలాంటిది. నీరు ఎంతసేపు వుంటుందో ఎవరు చెప్పగలరు? కావున ఆ నీరు కారిపోయేలోపే దీక్షగా భక్తితో రామనామం జపించుము.

## సీతాదేవి

కం॥ సీతకు జతగా జగతిని
నాతిని వెతుకంగ కాదు నాతరమామే
భూతలి జేరిన, రమ, భూ
జాతను నాతల్లియనుచు చక్కగ కొలుతున్

తా॥ సీతమ్మ తల్లికి సరియైన స్త్రీని ప్రపంచమంతా వెతికినా నాతరమా కనుగొన సాధ్యమా? ఆమెయే భూమికి దిగివచ్చిన శ్రీలక్ష్మి. భూ పుత్రికను తల్లిగా చక్కగా పూజించెదను.



## శ్రీ వేంకటేశ్వరుడు

కం॥ కొండలరాయుడె దిక్కను
కొండంతటి ఆస లగ్గి గుండము జేరెన్
మెండగు భక్తిన్ పిలిచితి
నిండిన నా కనులు తుడువ నేలకు రాడే?

తా॥ ఆ ఏడుకొండలవాడే దిక్కు (నాకు) అనే నా కొండంత ఆసలు అగ్ని గుండంలో పడినవి. (పడి కాలిపోతున్నా) మిక్కిలి భక్తితో (రక్షించరా ప్రభూ అని) పిలిచాను. కన్నీటితో నిండిన నా కన్నులను తుడువగా నేలకు దిగిరాడేల?



## అలివేలు మంగ

కం॥ అలివేల్ మంగను కొల్తును
అలివేణిని వేంకటేశు ఆలిని నిపుడే
ఆలింపవె నామొరలను
ఆ లీలా మానుషుండు అలసట జేసెన్

తా॥ శ్రీ వెంకటేశ్వరుని ఇల్లాలయిన ఆ నల్లని కురుల అలివేలు మంగని ఇప్పుడే ప్రార్థించెదను. ఓ అమ్మా! నామొరలను వినవమ్మా. మనిషి రూపంలో తిరుగుతున్న ఆ లీలా వినోది నన్ను అలక్ష్యం చేస్తున్నాడు.



## వరాహస్వామి

కం॥ కిటియై శ్రీహరి, భూమిని
పటుతరముగ చాప, జుట్టు వాడౌ అసురున్
పటపట కొరుకుచు జంపెను
అటనే భూకాంత బెండ్లియాడెను భళిరా!

తా॥ శ్రీహరి వరాహమై తను ఆ భూమిని (చాపవలె) చుట్టు వాడైన ఆ రాక్షసుని (హిరణ్యాక్షుని) పటపట (దంతములతో) కొరికి (చీల్చుచూ) చంపెను. అక్కడే ఆ భూదేవిని వరించెను భళీ!

## భూదేవి

కం॥ భూసతి రమణుని గూడును
శ్రీసతి బుసకొట్టి తాను చిందులు వేయన్
ఈ సయ్యాటను నలిగిన
ఆ సామిని గొల్తునమ్మ అవనీకాంతా!

తా॥ ఆ భూదేవి శ్రీహరిని గూడినంతనే శ్రీలక్ష్మి కోపంతో బుసకొట్టి తను చిందులాడింది. ఈ వినోదపు కయ్యాలలో నలిగిన ఆ శ్రీహరిని కొల్చెదనమ్మా ఓ భూదేవీ (నీదయతల్లి)



## బ్రహ్మదేవుని స్తుతి

కం॥ నుదుటను 'రాతలు' వ్రాయగ
అదితుడుపగ వీలుకాదు ఆతనికైనన్
ఇది విని గొలువరు నలువను
ముదముగ వానయ్యగొలిచి మ్రొక్కుదురకటా!

తా॥ఒక్కసారి నుదుటిమీద తలరాత వ్రాశాడంటే అది తుడవటం ఆయనకి కూడ సాధ్యంకాదు ఇది విన్నారు కనుక ఎవ్వరూ ఆ బ్రహ్మయ్యను పూజించరు. సంతోషంగా ఆయన తండ్రి శ్రీహరిని ప్రార్థిస్తారు. అయ్యయ్యో బ్రహ్మయ్యా!



## సరస్వతీ స్తుతి

కం॥ చదువుల సుదతిని కొలుతును
ముదముగ నా యెదనునిల్పి మ్రొక్కెదనిదిగో
పెదవులు నాలిక కదలగ
పదములు పదకవితలవగ పద్యము చెబుదున్

తా॥చదువులకి స్త్రీరూపమైన ఆ సరస్వతీ దేవిని మిక్కిలి సంతోషంతో నా హృదయంలో నిలిపి, ఇదే మ్రొక్కెదను. నా పెదవులు, నాలిక కదిలి మాటలు పదకవిత్వం అవుతుండగా నేను పద్యమును చెప్పెదను గాక.



## గాయత్రీదేవి

కం॥ ముప్పూటలనే గొల్తును
ఎప్పుడునెడతెగని భక్తి హే గాయత్రీ!
తప్పులు గాయవె తల్లీ!
ఇప్పుడు నిటులైతిమమ్మ ఇకనేమందున్?

తా॥ హే! గాయత్రీమాతా! నిన్ను మూడు సంధ్యలలో నేను ప్రార్థించెదను. అంతు నెరుగని భక్తితో కొలిచెదను. నా తప్పులు క్షమించుము. ఈ నాగరిక ప్రవాహంలో కొట్టుకుపోతూ ఇప్పుడు ఇట్లా అయ్యాము. ఇంకా ఏం చెప్పమంటావమ్మా.

## కుమారస్వామి

కం॥ తిరుగను నెమలిని యెక్కుచు
హరునికి గారాల పట్టి అలుపునెరుగకే
సరిజత వల్లీ దేవికి
వరదేవా సేనపతిని ప్రార్థింతుమదిన్

తా॥ తిరుగుట కొరకు తను నెమలిని ఎక్కి అనాయాసముగా ఆశంకరుని ముద్దులకొడుకు స్కందుడు ఆ వల్లీదేవి సరియైన జతగానిని దేవతల సేనాధిపతియైన ఆ కుమారస్వామిని మనసున నిలుపుకుని ప్రార్థించెదను.



## శ్రీసత్యనారాయణ స్వామి

కం॥ సత్యన్నారాయణుడా!
నిత్యము కామనలు దీర్చి నింపగ సిరులన్
అత్యంత భక్తిజేతురు
ప్రత్యేకపు పూజ జనులు ప్రతి శుభమందున్

తా॥ ఓ సత్యనారాయణ మూర్తీ! ప్రతి దినము భక్తుల కోర్కెలు తీర్చి ధనంతో వారి ఇండ్లను నింపెదవు. అందుకోసం ప్రజలు ప్రతి శుభకార్యం లోనూ నీపూజ అత్యంత శ్రద్ధతో భక్తితో చేస్తారు.



## శ్రీకృష్ణ పరమాత్మ

కం॥ పాపుల పాపము బాపగ
పాపము 'పాప'య్యె హరియె పాపుల జెరలో
పాపుల బంపెను యమపురి
'పాపడు' పరమాత్మ అయ్యె పాపము నాపెన్

తా॥ పాపుల దుశ్చర్యలను ఆపుటకొరకు అయ్యో పాపం ఆ శ్రీహరియే పాపాయిగా ఆ చెరసాలను చేరి వాళ్ళను నశింప చేశాడు. తరువాత ఆ పాపాయే పరమాత్మగా మారి దుర్మార్గమును నిరోధించాడు.



## రుక్మిణి దేవి

కం॥ సందేశంబును రుక్మిణి
బృందావని ప్రియునికంపె పదరమ్మంచున్
ఆందోళనతో వేగెను
ముందుగ ఆ తల్లి గొల్తు మురహరి ముదితన్

తా॥ రుక్మిణీదేవి తను బృందావన ప్రియుడైన శ్రీకృష్ణునకు పదస్వామీ నువు వచ్చి నన్ను కొనిపో అని సందేశము పంపింది. కానీ ముందుగా ఎంతో ఆందోళనతో వేగిపోయింది. శ్రీకృష్ణుని ప్రియసతియైన ఆ తల్లిని పూజింతును.

## అన్నపూర్ణ

కం॥ అన్నము ప్రాణము ప్రాణికి
అన్నింటికి మూలమదియె అన్నది నిజమే
అన్నము బెట్టెడి తల్లీ!
నన్నేలవె అన్నపూర్ణ! నామొర వినవే

తా॥ జీవులందరికీ జీవము ఆ అన్నవేం. (ఆహారము) అన్నిటికీ (జీవి మనుగడకే) ఆధారము అనునటువంటి మాట నిజము అటువంటి అన్నము పెట్టు తల్లీ ఓ అన్నపూర్ణా! నా మొర విని నన్ను పాలించుము.



## హనుమంతుడు

కం॥ పవనాత్మజుడే దైవము
భవతారకుడతని వేడ బాధలు దీర్చున్
అవనిని ఆతని సరివా
రెవరయ్యా? లేరులేరు ఇది నిక్కంబౌ

తా॥ వాయునందనుడు ఆ హనుమంతుడు భవ బంధ విమోచకుడు. ఆయనను వేడుకొనిన కష్టములు తొలగించును. ఈ భూలోకంలో ఆయన సాటి వారెవరు? లేరు లేరు. ఈ మాట నిజము.



## రాధా మాధవం

కం॥ మాధుర్యమ్మగు విరహపు
బాధా తప్తయ్యె రాధ బృందావనిలో
రాధా మాధవులిరువురి
గాధలు కమనీయమయ్యె కావ్యాలయ్యెన్

తా॥ ఆ బృందావనిలో రాధ మధురమైన విరహపు బాధలో దహించబడినదై గడిపెను. ఆ రాధా కృష్ణుల కథలు చక్కటి కావ్యాలయ్యెను. (జయదేవుని గీత గోవిందం లాంటి వెన్నో)



## నరసింహస్వామి

కం॥ ఫెళ ఫెళ స్తంభము కూలగ
వెలువడె నరసింహుడపుడు విరిచెను దనుజున్
కొలిచిన ప్రహ్లాదునికిన్
విలువగు అభయమ్మునిచ్చె వేదనదీర్చెన్

తా॥ ఫెళ ఫెళమనే ధ్వనితో (ఆ హిరణ్యకశిపుడు గదతో మోదగా) కూలిన ఆ స్థంభంలో నుంచి నరసింహస్వామి అప్పుడు వెలువడి ఆ రాక్షసుని సంహరించాడు. తనను ప్రార్థించిన ప్రహ్లాదునికి శ్రేష్ఠమైన అభయ హస్తమును ప్రసాదించి దుఃఖ విముక్తి కలిగించాడు.

## కనకదుర్గ

కం॥ మహిషుని చంపగ వెలిసిన
మహిమాన్విత కనకదుర్గ మాతను గొలుతున్
మహిలో వెలిసిన తల్లివి
మహిమలు పొగడంగ తరమె మానవులారా!

తా॥ దుర్మార్గుడైన ఆ మహిషాసురుని చంపుటకు మహిమలుగల తల్లి కనకదుర్గ వెలిసింది. భూలోకంలో వెలిసిన ఆ తల్లి మహిమలు పొగుడుటకు ఓ మానవులారా సాధ్యమా? పరిపూర్ణ భక్తితో వేడుకుందుము.



## వామనుడు

కం॥ బుడి బుడి నడకల అడుగిడి
అడిగెను బలిరాజు గూడి ఆ వామనుడే
అడుగులు మూడని గడుసుగ
ఇడు ఆ బలి తలను ద్రొక్కి ఇచ్చెను కీర్తిన్

తా॥ చిన్ని చిన్ని అడుగుల నడకతో వచ్చి బలిచక్రవర్తిని కలిసి ఆ వామనుడు మూడు అడుగులు దానం గడుసుగా అడిగి, ఇవ్వదలచిన ఆ బలి తలను పాతాళానికి త్రొక్కి ఎంతో కీర్తినిచ్చి ధన్యుణ్ణి చేశాడు.



## భద్రకాళి

కం॥ ఆ భద్రకాళి గొల్చిన
ఏ భయమూ కలుగదయ్య ఇది నిజమయ్యా
తా భక్త కోటికండగు
ఆ భీకరి తల్లి గాచునందరి నిలలో

తా॥ ఆ భద్రకాళిని ప్రార్థించి పూజించినవారికి ఏ భయము కలుగదు. ఈ మాట సత్యము. తను కోట్లాది భక్తులకు అండగా, భయంకరంగా కనిపించే ఆ తల్లి ఈ భువిలో అందరినీ కాపాడుతుంది.



## సూర్య భగవానుడు

కం॥ సూర్యుడె జీవనదాతగ
ఆర్యులు ఏనాడొ గొల్చిరందరు వినుడీ
కార్యము సాధింపంగా
ఆర్యా! తెలవారకుండ అది సాధ్యంబే?

తా॥ సూర్యుడే జీవనదాత అని ఈ భూమిలో ఏనాడో గ్రహించి అందరూ పూజించారు. ఆ విధంగా ఏ పని సాధించాలన్నా చీకటి పోయి వెలుతురు రావాలి. అయ్యా! అది సూర్యుడు ఉదయించి తెల్లవారకుండా ఎలా సాధ్యం?

## లలితాదేవి స్తుతి

కం॥ లలితా నామ సహస్రం
పలుకుటకే 'మడిగ' నుండవలెనో తల్లీ!
నిలిపిన మనమును నీపై
తలకాతువు వరములిచ్చి తప్పక మాకున్

తా॥ ఓ తల్లీ లలితా దేవీ! నీ సహస్రనామం పఠించుటకు మడి, ఆచారం ఉండాలి. మనసు నీపై లగ్నం చేయాలి, అప్పుడు తప్పక వరములిచ్చి మమ్ము రక్షిస్తావు.



## శనీశ్వరుడు

కం॥ శని తా బట్టక మానడు
మనసున మనమెంత క్రుంగి మథనము పడినన్
గొనకొని ప్రార్థన జేసిన
తన 'తాపము' తగ్గజేయు తను శాంతించున్

తా॥ ఆ శనీశ్వరుడు పట్టుకోకుండా ఉండడు. మనం దిగులుపడి ఎంత ఏడ్చినా లాభంలేదు. అయితే ప్రయత్నించి భక్తితో పూజించి ప్రార్థన జేసిన తన తీవ్రత తగ్గించి కొంత శాంతించును. (దెబ్బలు కొట్టినా).



## అయ్యప్ప స్వామి

కం॥ మోహిని ఆయెను ఆ హరి
మోహావేశమున దనుజ మూకలు సోలెన్
మోహిని గోరగ శివుడే
ఓహో! అయ్యప్ప వెలిసి యుర్విని గాచెన్

తా॥ ఆ శ్రీహరి మోహినిగా అవతరించగా, మోహ పరవశులై రాక్షసమూకలు మత్తులోపడి పోయినవి. పరమ శివుడే ఆ మోహినిని కోరి భ్రమించగా ఆహా! ఆ అయ్యప్ప స్వామి భూలోకంలో అవతరించెను.



## గౌతముడు

కం॥ గౌతముడు కలత జెందెను
పాతకమున జనులు బొందు బాధలు గాంచెన్
ఆతని మార్గమహింసయి
భూతలి మానవులగావ బుద్ధుండయ్యెన్

తా॥ గౌతముడు (జనుల దుఃఖము జూచి బాధపడెను) ప్రజలు పాపాలు చేస్తూ బాధలు పడుతున్నారు. అతను ఎన్నుకున్న మార్గం (ప్రపంచ మానవాళిని కాపాడుటకు) అహింస. అందువల్ల అతడు బుద్ధుడయ్యాడు.

# శ్రీ సాయినాథుడు

కం॥ నిన్నెన్నుకున్న నన్నూ
కన్నుల రెప్పలుగ మిన్న కాపాడుమయా
కన్నుల గప్పును గర్వము
సన్నుతి జేసెదను ద్రుంపు సాయీ! నేడే

తా॥ ఓ సాయినాథా! నిన్ను నాదైవంగా ఎన్నుకున్న నన్నుకూడా (వదలక) మిన్నగా వుండేట్లు అనుగ్రహించు. గర్వము కన్నులకు పొరలు కప్పునట్లు చేస్తుంది. దాన్ని ఈరోజే నశింపజేసి నన్ను కాపాడమని వేడుకుంటూ నీకు మ్రొక్కెదను.



# దేవీ స్తుతి

కం॥ అమ్మను చూడని తమ్ములు
ఇమ్ముగ వేలాది కలరు ఇమ్మహి తెలియన్
అమ్మలకమ్మగు అమ్మను
అమ్మని నీమదిని నమ్ము అమ్మగునీకున్

తా॥ కన్నతల్లి ఎలావుంటుందో చూడని తమ్ముళ్ళు ఈ భూమిపై వేల సంఖ్యలో చక్కగా తెలియునట్లు గలరు. మన అమ్మలందరికీ తల్లి అయిన ఆ దేవిని నీమదిలో అమ్మవలె భావించినచో నీకు కూడ తప్పక అమ్మ అయి ఆదుకుంటుంది.



# దత్తాత్రేయుడు

కం॥ అత్తరి త్రిమూర్తులొకటై
ఎత్తిరి అవతారమొకటి ఇలవెలయంగా
దత్తాత్రేయుడు గురుడై
ఉత్తమమగు జ్ఞానమిచ్చి యుర్విని గాచెన్

తా॥ అప్పుడు త్రిమూర్తులు ఒకటై ఒకఅవతారం ఎత్తిరి. ఆ విధంగా పృథ్విని వెలసిన ఆ గురుడే దత్తాత్రేయుడు మహోన్నతమైన జ్ఞానమిచ్చి ప్రపంచాన్ని కాపాడాడు. (తరువాత వచ్చిన గురువులైన సాయివంటి వారందరికీ ఆయనే గురుపుంగవుడు)



# శ్రీఆదిశంకరులు

కం॥ శంకర భగవత్పాదులు
శంకరునవతారమట్లు జ్ఞానప్రబోధల్
లెంకలు గొలువగ జేసిరి
శంకేలర భక్తి పూజసలిపెదనిపుడే

తా॥ శ్రీశంకర భగవత్పాదులు ఆదిగురువు. ఆయన శంభుని అవతారంగా ఎంతోమంది శిష్యులు కొలుస్తుండగా జ్ఞాన ప్రబోధనలు చేశారు. ఇంకా అనుమానాలెందుకు? ఇప్పుడే భక్తితో పూజించెదను.

## శ్రీ రాఘవేంద్రస్వామి

కం॥ శ్రీరాఘవేంద్ర గురులను
ఆరాధించెదను భక్తి ఆ గురు దయచే
కోరిన కోర్కెలు దీరును
మీరిన జ్ఞానంబు భక్తి మీ స్వంతంబౌ

తా॥ శ్రీ రాఘవేంద్ర గురుదేవులను భక్తితో ఆరాధించెదను. ఆ గురుని దయవలన నేను కోరిన కోర్కెలు తీరును. పెరిగిన జ్ఞానము భక్తి మీకు స్వంతమగును (మిమ్ము కాపాడును).



## శ్రీ రామానుజులు

కం॥ శ్రీ రామానుజ గురువుల
నారాధించెదను 'వారి' అద్వైతంబున్
వేరా దైవము జీవుడు
మీరక 'హరి' గొల్వుమయ్య మెలగుము దాసై

తా॥ గురుదేవులు శ్రీరామానుజా చార్యుల వారిని పూజించెదను. వారి అద్వైత (విశిష్ఠాద్వైతం) మును కూడా లెస్సగా భావించెదను.దైవము జీవుడు వేరు వేరు. ఎప్పుడూ శ్రీహరిని పూజింపుము. ఆయన దాసులయి ప్రార్థించండి.



## శ్రీ సత్యసాయి

కం॥ శ్రీ సత్యసాయి బాబా
ఆశలు ఫలియించవెలసి అందరు గొలువన్
చేసెను మేళ్ళను ప్రజలకు
ఏసరి లేనట్టి రీతి ఎందరొ మెచ్చన్

తా॥ శ్రీ సత్యసాయిబాబా భక్తుల కోర్కెలు తీర్చుటకై (పుట్టపర్తిలో) వెలిసి ఎంతోమంది (విదేశీయులు కూడా) మెచ్చుకునే విధంగా ఎన్నో మంచిపనులు ప్రజలకు పోల్చుటకు వీలుకాని విధంగా చేశారు. (కేవలం దేవుడే అలా చేయగలడు)



## సంతోషిమాత

కం॥ సంతోషిమాత గొల్తురు
ఎంతో నియమంబుతోటి ఇష్టము గూడన్
ఇంతులు పూజల ఫలముగ
సంతోషములిచ్చి గాచు జననియు తోడై

తా॥ సంతోషిమాతను (స్త్రీలు) ఎంతో నిష్ఠతో ప్రీతితో పూజిస్తారు. ఆ అమ్మ ఆపూజల ఫలముగా వారికి ఆనందమును తను తోడునీడై భక్తులందరికీ ఇస్తుంది.

## జీసస్

కం॥ కరుణే శాంతికి మూలము
నిరుపమమగు శాంతిలేక నిధులేమిటికిన్
కరుణా సింధువు యేసును
మరియను ప్రార్థింతురిలను మన క్రైస్తవులున్

తా॥ మానవ లోకంలో శాంతి కలుగుటకు మూలమే కరుణ. సాటిలేని ఆ శాంతిలేక ధనం, సంపదలు ఏమి ఉపయోగం. కరుణా సముద్రుడైన ఆ ఏసును ఆ ప్రభుని జనని మరియను మన క్రైస్తవులందరు ప్రార్థింతురు.



## అల్లా మాలిక్

కం॥ అల్లా ఏలిక అనగా
'కల్లేమి' టి అందులోన కానిది కలదా?
అల్లాయే ఆ జీసస్
నల్లని శ్రీరాముడతడె నటరాజతడే

తా॥ అల్లా జగత్పిత ప్రభువు అంటే అందులో అసత్యం ఏముంది? కానిదేముంది? అల్లాయే కొందరికి జీసస్ కొందరికి నీలమేఘ శ్యాముడైన శ్రీరామచంద్రుడు. అతడే, శంకరుడూ అతడే అని తెలుసుకుంటే ఇక ఎవర్ని ఆరాధించినా ఒకటే.



## పరబ్రహ్మ

కం॥ ముందుగ చెట్టా? విత్తా?
ముందుగ పురుషుండ? లేక ముదితయ్యేనా?
ముందుగ పక్షా? గుడ్డా?
ముందుగ ఆ బ్రహ్మమొకటె ముందిది వినరే?

తా॥ మొదట పుట్టింది ఏది. చెట్టా లేక దాని విత్తనమా? పురుషుడా లేక స్త్రీయా పక్షినా లేకదాని గుడ్డా? ఇది తెలుసుకోవటమెట్లు? (అవన్నీ వదిలిపెట్టి) ముందీమాట వినండి అన్నిటికీ ఆది ఆ పరబ్రహ్మమే.



## సర్వాత్మ

కం॥ అందరిలో ప్రాణంబై
అందరినీ నడుపుచున్న ఆ సర్వాత్మే
అందరి పాలిటి దేవుడు
అందరికీ తెలియకుండె అది వింతకదా.

తా॥ ఆ సర్వాత్మ రూపముతో ఆ పరమాత్మ అందరిలో ప్రాణముగా అందరినీ నడిపించు చున్నాడు. లేనిచో ఇది కుళ్ళిపోయే శరీరమే. ఆ సర్వాత్మే అందరికీ దైవము. అయితే ఇది నేటికీ అందరికీ తెలియకుండా వుంది. ఆ ఆత్మ వదిలిన శరీరాన్ని చూచి అంతగా ఏడ్చుట ఎంత వింత?